# సాక్షి
## ములుగు

గురువారం । 2 జనవరి । 2025






**'కోట'లో పర్యాటకుల సందడి..**

నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోటకు పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. - 8లో▸



**మాంజాతో మజాక్‌లొద్దు..**

పతంగి ఎగురవేయడానికి వినియోగించే నిషేధిత మాంజా ప్రమాదకరంగా మారుతోంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
28.0°/14.0°

**వాతావరణం**

జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### మంత్రి సీతక్కను కలిసిన నాయకులు



కన్నాయిగూడెం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అప్సర్ పాషా ఆధ్వర్యంలో నాయకులు గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్కను బుధవారం కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీతక్క, రాహుల్‌గాంధీతో ఉన్న చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మండలంలోని అభివృద్ధి పనులు, అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ సునార్కని సాంబశివ, ఎండీ.మునీర్ తదితరులు పాల్గొన్నారు.

### 'సకాలంలో వేతనాలు చెల్లించాలి'



ఏటూరునాగారం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సీఆర్‌టీలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రతినెలా గ్రీన్ చానల్ పద్దు ద్వారా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని సీఆర్‌టీ నాయకుడు డీఎస్.తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో సీఆర్‌టీలు చేపట్టిన సమ్మె బుధవారానికి 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన సమ్మెకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళా టీచర్లకు ప్రసూతి సెలవులు 180 రోజులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, శేషగిరి, బాలాజీ, రవీందర్, వాణిశ్రీ, సారయ్య, నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.

### అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ కోచ్‌గా విష్ణువర్ధన్



వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు లక్నోలో జరగనున్న అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఇండియా పురుషుల జట్టు కోచ్‌గా ఖిలావరంగల్‌కు చెందిన బొడ్డు విష్ణువర్ధన్ నియమితులయ్యారు. ఈమేరకు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇండియా జనరల్ సెక్రటరీ డాక్టర్ తేజరాజ్‌సింగ్ బుధవారం నియామక ఉత్తర్వులు జారీ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. తన నియామకానికి సహకరించిన అసోసియేషన్ ఈడీ డాక్టర్ ఆనంద్ ఈశ్వర్ పాండే, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ చైర్మన్, హెచ్‌సీఏ అధ్యక్షుడు ఎ.జగన్మోహన్ రావు, శాట్ వీసీఅండ్‌ఎండి సోనీ బాలాదేవి, శాట్ డీడీ జి.రవీందర్, హనుమకొండ డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్‌కు విష్ణువర్ధన్ ధన్యవాదాలు తెలిపారు. ఇండియా టీం కోచ్‌గా ఎంపికైన విష్ణువర్ధన్‌ను ఒలింపిక్స్ సంఘం బాధ్యులు, కోచ్‌లు, క్రీడా సంఘాల బాధ్యులు అభినందించారు.

### రుద్రేశ్వరుడికి ప్రత్యేక పూజలు



హన్మకొండ కల్చరల్: ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా వేయిస్తంభాల ఆలయంలో రుద్రేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠశర్మ, అర్చకుడు ఉత్పిష్ట గణపతికి ఆరాధన, రుద్రేశ్వరస్వామికి 51 కిలోల పెరుగుతో అభిషేకం, రుద్రాభిషేకాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు గంటల తరబడి లైన్లలో నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వెంకటయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### మల్లన్నను దర్శించుకున్న సీపీ

ఐనవోలు: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి ఐనవోలు మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి మల్లన్న చిత్రపటాన్ని బహూకరించారు. వేద పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. ఏసీపీ తిరుపతి, ఎస్సై శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈసారైనా కార్డు వచ్చేనా?

## రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలు



- సంక్రాంతి నుంచి అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- దరఖాస్తుదారుల్లో చిగురిస్తున్న ఆశలు

వెంకటాపురం(ఎం): రేషన్‌కార్డుల కోసం నిరుపేదలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రేషన్‌కార్డుల పంపిణీ చేపట్టకపోవడంతో పేదలు నిరుత్సాహానికి గురయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో జిల్లాలోని 9 మండలాల పరిధిలో 12,158 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంక్రాంతి నుంచి రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. ప్రతీ పథకానికి రేషన్‌కార్డునే ప్రామాణికంగా అడుగుతుండడంతో చాలామంది పేదలు ప్రభుత్వ పథకాలు అందక నష్టపోతున్నారు. ఈసారైనా అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులను అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**ప్రజాపాలనలో వేలాదిగా దరఖాస్తులు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన కార్యక్రమం ద్వారా రేషన్ కార్డులతో పాటు ఇతర పథకాలకు దరఖాస్తులు స్వీకరించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 12,158 మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అర్హులై ఉండి రేషన్‌కార్డు లేని వారితో పాటుగా కొత్తగా వివాహం చేసుకున్న వారు, పిల్లల పేర్లు కార్డులో నమోదు కాని వారు దరఖాస్తు చేశారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రేషన్ కార్డులు లేక పేద ప్రజలు రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వ పథకాలకు సైతం దూరమయ్యారు. సంక్రాంతి నుంచి రేషన్‌కార్డులు జారీ చేస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటన చేయడంతో పేదలు, దరఖాస్తుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**రేషన్ షాపులు, కార్డుల వివరాలు**

జిల్లాలోని 9 మండలాల పరిధిలో 222 రేషన్ షాపులు ఉండగా 91,425 రేషన్‌కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రత కార్డులు 83,252 , అంత్యోదయ కార్డులు 8,172 , అన్నపూర్ణ కార్డు ఒకటి మాత్రమే ఉంది.

**మండలాల వారీగా రేషన్‌కార్డు దరఖాస్తుల వివరాలు**

| | |
|---|---|
| ములుగు | 1,490 |
| వెంకటాపురం(ఎం) | 1,655 |
| గోవిందరావుపేట | 1,289 |
| తాడ్వాయి | 460 |
| ఏటూరునాగారం | 1,743 |
| కన్నాయిగూడెం | 631 |
| మంగపేట | 3,027 |
| వెంకటాపురం(కె) | 536 |
| వాజేడు | 1,327 |

**ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నా..**



రేషన్‌కార్డు కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నా. 2018లో వివాహం కాగా 2019లో రేషన్‌కార్డు కోసం మీ సేవలో దరఖాస్తు చేశా. ఇటీవల ప్రజాపాలనలో సైతం దరఖాస్తు చేశాను. రేషన్‌కార్డు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కోల్పోతున్నాం. ప్రతీ పథకానికి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఈసారైనా రేషన్ కార్డును ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ఆశిస్తున్నాను.

- ఆర్.కరుణాకర్‌రెడ్డి, వెంకటాపురం(ఎం)

**ప్రతీ పథకానికి రేషన్‌కార్డు అడుగుతున్నారు..**



మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాను. రేషన్‌కార్డు కావాలని ప్రజాపాలనలో దరఖాస్తు చేశా. ఏడాది అవుతున్నా ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం చేసిన దరఖాస్తులకు మోక్షం కలగలేదు. ప్రతీ పథకానికి రేషన్‌కార్డు అడుగుతున్నారు. ఆదాయం సర్టిఫికెట్ కావాలన్నా, ఆరోగ్యశ్రీ లాంటి పథకాలకు రేషన్‌కార్డునే ప్రధానంగా అడుగుతున్నారు. రేషన్ కార్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- డి.పవన్‌కుమార్, వెంకటాపురం(కె)

# కొనసాగుతున్న ఉద్యోగుల సమ్మె



సమ్మెలో కూర్చున్న ఉద్యోగులు

ములుగు: రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె 23వ రోజుకు చేరుకుంది. సోమవారం రోజున రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ్, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నర్సింహారెడ్డిలతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఈ చర్చల్లో ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం సబ్ కమిటీని వేసి విచారిస్తామని తెలుపడంతో ఉద్యోగులు సమ్మెను యథాతథంగా కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ 23రోజులుగా సమ్మె చేస్తుండగా ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకపోగా ప్రభుత్వ ఉపాధ్యాయులతో తమ పనులను చేయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర, జిల్లా అధికారులు ప్రభుత్వ ఉపాధ్యాయులను తమ పనులకు వినియోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగులకు పనికి తగిన వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురిచేస్తుందని తెలిపారు. సమ్మెలో ఉన్న వారి గురించి పట్టించుకోకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం సరి కాదన్నారు. రెగ్యులరైజేషన్ భిక్ష కాదని తమ హక్కు అని వారు ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో చల్లా భాస్కర్ రెడ్డి, సోమిడి కరుణాకర్, కుమార్ పాడియా, ఎండీ.ఫిరోజ్, చిరంజీవి, సుజాత, రాజేశ్వరి, దేవేందర్, చందన, స్వరూప, మమత, సుబ్బారెడ్డి, రమేష్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.

## చీరలే చేనుకు రక్షణ





ఏటూరునాగారం మండల పరిధిలోని రొయ్యూరులో మిరప పంటలపై దుమ్ము పడకుండా రైతులు చీరలను రక్షణ కవచంగా అమర్చుకున్నారు. గతంలో ఇచ్చిన కేసీఆర్ చీరలతో పాటు ఇతర చీరెలను దడులకు కట్టి పంటలను రక్షించుకుంటున్నారు. 163వ జాతీయ రహదారి మీదుగా గ్రామంలోకి వెళ్లే వాహనాలతో దుమ్ము మిర్చి పంటలపై ఎగిసిపడుతుందని, రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బంది అవుతుందని రైతులు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఎన్‌హెచ్ నుంచి గ్రామంలోకి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని కోరుతున్నారు. – ఏటూరునాగారం

## ఉత్తమ, కఠిన సేవా పతకాలకు ఎంపిక

ములుగు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ, కఠిన సేవా పతకాలను ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఎంపికైన వారిని బుధవారం ఎస్పీ శబరీశ్ అభినందించారు. కఠిన సేవా పతకానికి ఓ.రాజేష్, స్పెషల్ పార్టీ నుంచి బి.కన్నయ్య, ఏఆర్‌పీసీలు జె.సురేశ్, అన్వేష్‌లు ఎంపికయ్యారు. అలాగే ఉత్తమ సేవా పతకానికి డీసీఆర్‌బీ నుంచి బి.శంకరయ్య, ఏఎస్సై విజయకర్‌రావు, పి.వెంకటరెడ్డి, ఏఆర్ ఎస్సైలు ఎండీ.నజీముద్దీన్, రాములు, ఏఆర్ హెచ్‌సీలు బి.జనార్దన్, మధుఅలీ, రాజు, నవీన్‌కుమార్‌లు ఎంపికయ్యారు.

## కూలి పెంచాలని హమాలీల సమ్మె



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

ఏటూరునాగారం: సివిల్ సప్లయీస్ ఆధ్వర్యంలో పనిచేసే హమాలీలకు కూలి పెంచాలని సీపీఐ మండల నాయకుడు ఎండీ. నాసర్‌పాషా అన్నారు. మండల కేంద్రంలోని ఎంఎల్‌ఎస్ రేషన్ పాయింట్ వద్ద హమాలీలు బుధవారం సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా బుధవారం నాసర్‌పాషా సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన హమాలీల కూలిరేట్ల పెంపు జీవోను వెంటనే అమలు చేయాలన్నారు. గతంలో క్వింటాకు రూ.26లు ఉండగా ప్రభుత్వం అదనంగా రూ.3 పెంచి రూ.29లు చెల్లించాలన్నారు. అదే విధంగా హమాలీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దండి కొమురయ్య, వెల్దండి రమేష్, దానం భిక్షపతి, మాటేటి కుమార్, అక్కినపల్లి రవి, పాశికంటి శ్రీధర్, బొద్దుల రాజు, గాడిచర్ల బాబు, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

## కాళేశ్వరాలయంలో భక్తుల రద్దీ



కాళేశ్వరం: క్యూలైన్‌లో దర్శనానికి వెళ్తున్న భక్తులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేసిన అనంతరం స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక అభిషేక, అర్చన పూజలు నిర్వహించారు. శుభానంద దేవి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చన పూజలు చేశారు. ఆలయ పరిసరాలు, గోదావరి తీరంలో భక్తులతో కిక్కిరిసింది.

## ఎండిన వనంలో ఔషధ మొక్కలు

- ప్రకృతివనంలో మొక్కలు నాటిన వన ప్రేమికులు



మొక్క నాటుతున్న ప్రకృతి ప్రేమికులు

కాటారం: నూతన సంవత్సరం వేళ ప్రకృతి ప్రేమికులు ఓ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఔషధ మొక్కలు నాటి ప్రకృతిపై తమ ప్రేమను చాటుకున్నారు. మహాముత్తారం మండల కేంద్రంలో 2021లో అటవీశాఖ అధికారులు ప్రభుత్వ స్థలంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పలు రకాల మొక్కలు నాటి వదిలేశారు. మూడేళ్లుగా సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రకృతివనంలో మొక్కలు ఎండిపోయి మోడులుగా మారాయి. దీంతో మండలానికి చెందిన పలువురు ప్రకృతివనంలో తిరిగి మొక్కలు నాటాలనే ఆలోచనకు వచ్చారు. దాతలు, గ్రామస్తుల సహకారంతో ఔషధ మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు బుధవారం ప్రకృతి ప్రేమికులు, యువకులు, గ్రామానికి చెందిన పలువురు కలిసి రావి, వేప, ఉసిరి, మారేడు, నేరేడు, జమ్మి, మర్రి, పనస, ఎలక, అల్లనేరేడు, పాల, మోదుగ, మామిడి, ఇతర ఔషధ మొక్కలను నాటారు. వీటి సంరక్షణ చర్యలు చేపట్టడానికి ప్రణాళిక ఏర్పాటు చేసుకున్నారు. ప్రకృతిప్రేమికులు విరాళాల ద్వారా మొక్కలు నాటడం పలువురిని ఆలోచింపజేస్తుంది. వీరి ఆలోచనను పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బానోతు రాజునాయక్, అజ్మీర డాకునాయక్, పెరుమాండ్ల సురేష్, చంద్రగిరి రవి, రంగు శ్రీనివాస్, ఆలోత్ ప్రతాప్ పాల్గొని మొక్కల పెంపకం బాధ్యతను తీసుకున్నారు.

# తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

**గత సర్కారు తీసుకొచ్చిన 257 మెమోనే కారణం**

- 2023లో రూ.358 కోట్లు.. 2024లో రూ.320 కోట్లు
- రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతికి తీసుకునే నిర్ణయంపై ఆశలు



కాజీపేట అర్బన్: ప్రభుత్వానికి మూడో ఆదాయ వనరు అయిన రిజిస్ట్రేషన్ శాఖలో ఆదాయం తగ్గింది. 2023లో రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్నా రూ.358 కోట్ల ఆదాయం సమకూరింది. కానీ, 2024లో దస్తావేజుల సంఖ్య పెరిగినా కూడా ఖజానాకు రూ.320 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది.

**రియల్ ఎస్టేట్‌పై 257 మెమో ప్రభావం..**

రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖను ప్రక్షాళన చేసేందుకు గత ప్రభుత్వం 257 మెమో తీసుకొచ్చింది. దీని ద్వారా అనుమతిలేని భూముల దస్తావేజులకు రిజిస్ట్రేషన్లు చేయకూడదనే నిబంధన నేటికి కొనసాగుతుండడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గిపోయింది. దీని ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై పడిపోయింది. భూములను కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్లు కాలేదు. కొనేవారు ముందుకు రాక అమ్మేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. లేఅవుట్, అనుమతి ఉన్న భూముల దస్తావేజులు మాత్రమే రిజిస్ట్రేషన్లు కావడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల జోరు తగ్గింది.

**సేల్ డీడ్‌లతోనే ఖజానాకు ఆదాయం..**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనుమతులు లేని దస్తావేజులకు రిజిస్ట్రేషన్లు కావడం లేదు. ఇంటి నంబర్, లే అవుట్లకు మాత్రమే రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. దీంతో ఏడాది కాలంలో మార్టిగేజ్ దస్తావేజులు పెరిగిపోయాయి. సాధారణంగా సేల్ డీడ్‌లతో ఖజానాకు ఆదాయం ఎక్కువగా సమకూరుతుంది. మార్టిగేజ్ వంటి దస్తావేజులతో దస్తావేజుల సంఖ్య పెరిగినా ఆదాయం మాత్రం తగ్గిపోయింది.

**రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపులు..**

రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖలో పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. రిజిస్ట్రేషన్లపై సైతం నూతన నిర్ణయాలను తీసుకునే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. కాగా, సంక్రాంతి రోజున దస్తావేజుల రిజిస్ట్రేషన్లపై కీలక నిర్ణయాలను తీసుకుని ప్రకటన చేసే అవకాశం ఉందని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చర్చించుకుంటున్నారు.

**ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2023, 2024 సంవత్సరాల్లో ఖజానాకు వచ్చిన ఆదాయం వివరాలు..**

| సంవత్సరం | దస్తావేజులు | ఆదాయం |
|---|---|---|
| 2023 | 1,04,297 | రూ.358 కోట్లు |
| 2024 | 1,05,363 | రూ.320 కోట్లు |

### బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

చిట్యాల/భూపాలపల్లి రూరల్: మండలంలోని నైన్‌పాక గ్రామంలోని నాపాక సర్వతోభద్ర ఆలయ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో మహాజాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ యాదండ్ల రాజయ్య తెలిపారు. ఈ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెలుకూరి రాజయ్య, తోట్ల ఎర్రయ్య, ముద్దంగుల అయిలయ్య, కాశిపాక కమల, నాయకులు భాస్కర్, రాయకొమురు, తిరుపతిగౌడ్, శంకర్, రాములు, రవి, కొంరయ్య, రఘుపతి, మధు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గ ప్రజలకు 2025 సంవత్సరం అందరికీ ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

# 74శాతం బొగ్గు ఉత్పత్తి

- జీఎం రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని కాకతీయ గనుల్లో 74 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఏరియాలోని జీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. గడిచిన డిసెంబర్ మాసంలో 5.42 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 4.02 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించి 74శాతంలో నిలిచినట్లు తెలిపారు. వెలికితీసిన బొగ్గులో 2.35లక్షల టన్నులను రవాణా చేశామన్నారు. ఓసీ–2లో 96శాతం, ఓసీ–3లో 63 శాతం మట్టి వెలికితీత పనులు చేశామన్నారు. ఏరియాలో బొగ్గు ఉత్పత్తి పెంచడానికి ఉద్యోగులందరు సమష్టిగా కృషి చేయాలన్నారు. గైర్హాజరు శాతాన్ని తగ్గించడానికి ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. భారీ యంత్రాలు, ఎస్‌డీఎల్ యంత్రాల పని గంటలను పెంచడానికి కృషి చేయాలని కోరారు. ఉద్యోగులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని, రక్షణ విషయంలో రాజీపడేది లేదన్నారు. కారుణ్య నియామకాలు వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### మాలధారులకు పండ్లు పంపిణీ



అయ్యప్ప స్వాములకు పండ్లు అందజేస్తున్న షేక్ దాదామియా

కాటారం: అయ్యప్ప స్వాములకు అరటిపండ్లు పంపిణీ చేసి తన భక్తిని చాటుకున్నాడు ఓ ముస్లిం. మండల కేంద్రానికి చెందిన మైనార్టీ నాయకుడు షేక్ దాదామియా స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భాగంగా తన వంతుగా స్వాములకు అరటిపండ్లు అందజేశారు. అనంతరం మాలధారణ స్వాములతో కలిసి భిక్ష చేశారు. ప్రతిఒక్కరూ కులమతాలకు అతీతంగా ఐక్యమత్యంతో ఉండాలని ఆకాంక్షించారు.

## సీఎం కప్ ఖోఖో పోటీల మహిళల విజేత ఆసిఫాబాద్

● పురుషుల విజేత హైదరాబాద్



హైదరాబాద్ పురుషుల జట్టు

వరంగల్: సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో మహిళల విభాగంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన ఈ పోటీల్లో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మొదటి స్థానం, నల్లగొండ ద్వితీయ, హైదరాబాద్ తృతీయ, రంగారెడ్డి నాలుగో స్థానాల్లో నిలిచాయని డీవైఎస్ఓ సత్యవాణి తెలిపారు. అదేవిధంగా పురుషుల విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు మొదటి స్థానం, మేడ్చల్ మల్కాజిగిరి రెండో స్థానం, ఆదిలాబాద్ మూడో స్థానం, నిర్మల్ జిల్లా జట్టు నాలుగో స్థానాల్లో నిలిచాయని సత్యవాణి తెలిపారు.

## క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య

● బొల్లారంలో ఘటన



సాయికిరణ్ (ఫైల్)

వాజేడు: ఆలస్యంగా ఇంటికి వచ్చావని తల్లి మందలించడంతో క్షణికావేశానికి గురైన ఓ యువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ములుగు జిల్లా వాజేడు మండలం బొల్లారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కంతి సాయికిరణ్ (19) తన స్నేహితులతో కలిసి డిసెంబర్ 31న పార్టీ చేసుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో ఆలస్యంగా ఇంటికి వచ్చిన సాయికిరణ్‌ను తల్లి జానకమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తీసుకుని పొలాల వైపునకు వెళ్లి తాగాడు. సాయికిరణ్ ఎంతకూ ఇంటికి రాకపోవడంతో బుధవారం ఉదయం గాలించగా పొలాల్లో పడి ఉన్నాడు. వెంటనే వెంకటాపురం(కె) ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యం చేస్తుండగానే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లతీఫ్ తెలిపారు.

**ఉద్యోగం పోయిందనే మనోవేదనతో శంభునిపల్లిలో వ్యక్తి..**

కమలాపూర్: మండలంలోని శంభునిపల్లికి చెందిన మోడెం శ్రీనివాస్ (55) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తెలిపారు. బతుకుదెరువు నిమిత్తం సుమారు పదేళ్ల క్రితం సౌదీ అరేబియా దేశానికి వెళ్లిన శ్రీనివాస్.. అనారోగ్య కారణాలతో ఏడాది క్రితం శంభునిపల్లికి వచ్చాడు. అప్పటి నుంచి తన ఉద్యోగం పోయిందని మనోవేదనకు గురవుతూ ఒంటరిగా ఉంటున్నాడు. పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా ఆరోగ్యం కుదుట పడలేదు. ఈ క్రమంలోనే బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహ్యతకు పాల్పడ్డాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబీకులు గమనించి కిందకు దించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తెలిపారు.

**వంగపహడ్‌లో విద్యార్థి..**



సాయివర్షిత్ (ఫైల్)

హసన్‌పర్తి: ఓ డిగ్రీ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం హసన్‌పర్తి పీఎస్ పరిధిలోని వంగపహడ్‌లో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయి వర్షిత్(20) నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై శీలం రవి ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కాగా, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.





◆ పదేళ్ల బాలుడు అనుదీప్ అప్పటి వరకు స్నేహితులతో సరదాగా గాలిపటం ఎగరేశాడు. తెగిపడిన ఆ పతంగిని 33కేవీ విద్యుత్ తీగలపై నుంచి తీసే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. శరీరమంతా కాలిన గాయాలతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన రెండు రోజుల క్రితం వరంగల్ గిర్మాజీపేటలో చోటు చేసుకుంది.

◆ గత నెల 28వ తేదీన జనగామ జిల్లా కేంద్రం ఫ్లైఓవర్‌పై నుంచి ముగ్గురు యువకులు సనత్‌కుమార్, సాయికుమార్, సాయిరాం బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో గాలి దుమారానికి కొట్టుకొచ్చిన చైనా మాంజా మెడకు తగిలి సనత్‌కుమార్ కిందపడ్డాడు. మెడ కోతకు గురికావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో వడ్లకొండకు చెందిన ఓ కుటుంబం బైక్‌పై వెళ్తుండగా మాంజా.. వాహనంపై ముందు కూర్చున్న ఐదేళ్ల బాలుడు వీక్షిత్ మెడకు తీవ్ర గాయం చేసింది. దీంతో బాలుడు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



గాయపడిన సనత్‌కుమార్

◆ గత నెల 31న భూపాలపల్లిలో పట్టణానికి చెందిన సముద్రాల అజయ్ బైక్‌పై జయశంకర్ సెంటర్ నుంచి సుభాష్‌కాలనీ వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో కూరగాయల మార్కెట్ సమీపంలో చిన్నారులు ఎగరేస్తున్న గాలిపటం మాంజా అజయ్ మెడకు చుట్టుకుంది. దీంతో వాహనం అదుపుతప్పగా కిందపడ్డాడు. మెడకు స్వల్పంగా కోసుకోవడంతో రక్తస్రావమైంది.



గాయపడిన అజయ్

ఇలా సంక్రాంతి సెలవులకు ముందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో గాలిపటం కారణంగా పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలు ప్రజలకు హెచ్చరికలాంటివని చెప్పొచ్చు. అందుకే గాలిపటాలు ఎగరేసే సమయంలో పిల్లలు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. జాగ్రత్తలు తీసుకుంటూ పతంగులు ఎగరేయాలి. ఏమాత్రం ఆదమరిచినా మూల్యం చెల్లించకతప్పదు.

# మాంజాతో మజాక్‌లొద్దు..



## పతంగి సంబురం.. కావొద్దు విషాదం

● పిల్లలకు తల్లిదండ్రులు జాగ్రత్తలు చెప్పాలి ● కైట్స్ ఎగరేస్తున్న సమయంలో గమనించాలి

కాజీపేట: పతంగి ఎగురవేయడానికి వినియోగించే నిషేధిత మాంజా ప్రమాదకరంగా మారుతోంది. ఎగురవేసే వారి చేతి వేళ్లు తెగుతున్నాయి. పైగా రహదారులపై వెళ్తున్న వారి మెడకు బిగుసుకుపోవడంతో గొంతు దగ్గర గాయాలవుతున్నాయి. ఏటా రాష్ట్ర వ్యాప్తంగా మంజాతో గొంతు తెగి గాయాలు, మృతి వంటి ఘటనలు నమొదవుతున్నాయి. రోడ్ల వెంట గాలిపటాలు ఎగరేయొద్దు. ఇలా చేయడం వల్ల గాలిలో ఎగురుతున్న పతంగి చూసుకుంటూ వాహనాలను గమనించకుండా వ్యవహరిస్తే ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది. అందుకే మాంజాతో మాజాక్ చేయొద్దు. జాగ్రత్తలు తీసుకుంటూ సంక్రాంతిని సంతోషంగా జరుపుకోవాలి.

**మొదలైన సంక్రాంతి సంబురాలు..**

మరో వారం తర్వాత సంక్రాంతి సెలవులు మొదలుకానున్నాయి. అయితే పిల్లలు ఇప్పటి నుంచే పతంగి సంబురాలు మొదలు పెట్టారు. వాటిని ఎగరేస్తున్న సమయంలో బాలురు తమ భద్రతను మరుస్తున్నారు. సాధారణంగా పిల్లలకు ప్రమాదాలపై అవగాహన తక్కువ. ఎలా జాగ్రత్తగా ఉండాలనే విషయం తెలియక సంబురాల్లో మునిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గాలిపటాలు ఎగరేసే సమయంలో పిల్లలకు ఇబ్బందులు తలెత్తకుండా తల్లిదండ్రులు కనీస జాగ్రత్తలు చెప్పాల్సిన అవసరముంది.

**పతంగుల సందడి ప్రారంభం..**

పతంగుల సందడి ప్రారంభమైంది. పండుగ మరో 15 రోజులే ఉండడంతో మార్కెట్‌లో పతంగులు, చెరకలు, దారాలు, మాంజాల దుకాణాలు వెలిశాయి. గాలిపటాలు అధునాతన డిజైన్‌లలో లభిస్తున్నాయి. దీంతో చిన్నారులు, యువకులు వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. గాలిపటం సైజ్, నాణ్యతను బట్టి రూ. 5 నుంచి రూ.25 వరకు (ప్లాస్టిక్) కాగితంతో చేసినవి అందుబాటులో ఉన్నాయి. రంగు కాగితాలతో చేసిన పతంగులను సైజ్‌ను బట్టి రూ.5 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. ప్రత్యేకంగా క్లాత్‌తో తయారుచేసిన భారీ పతంగులను రూ. 130 చొప్పున విక్రయిస్తున్నారు. అలాగే పతంగులను ఎగరేయడానికి ఉపయోగించే (దారం) మాంజాలలో కూడా అనేక రకాలు ఉన్నాయి. కంగోజ్, మోకోనైట్, మోకోఫిల్, డ్రాగన్, మహాబలి, టైగర్ రకాలు మార్కెట్‌లో ఉన్నాయి. వీటిని రూ. 5 నుంచి రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు. ట్రైసిటీలో దాదాపు 350కి పైగా పతంగి విక్రయ కేంద్రాలు ఉంటాయని అంచనా.




కాజీపేటలో కైట్స్ షాపు

**ఇలా చేయాలి..**

- గాలిపటం ఎగరేయడానికి విశాల మైదానం ఎంపిక చేసుకోవాలి.
- పిల్లలంతా కలిసి గాలిపటం ఎగురవేస్తుంటే ఎవరైనా ఒకరు వారిని పర్యవేక్షించాలి.
- తక్కువ కఠినత్వం ఉన్న మాంజా లేదా దారం ఉపయోగించినా చేతి వేళ్లకు బట్ట, గౌజ్‌లు వేసుకుంటే గాయం నుంచి తప్పించుకోవచ్చు.
- విద్యుత్ తీగలు, భవనాలు, వృక్షాలు.. ఇలా ఎత్తైన ప్రదేశాల్లో పడిన గాలిపటాల కోసం వెళ్లడం మానుకోవాలి.
- పతంగి ఎగురుతున్న సమయంలో ఎటూ చూసుకోకుండా పరుగెడుతూ గుంతలు, కాల్వల్లో పడకుండా, వాహనాల కారణంగా గాయపడకుండా వాటిని వదిలేయడం మంచిది.
- పెద్దవి ఫ్యాన్సీ రకం గాలిపటాలకు బదులు తేలికపాటివి వినియోగించేలా చూడాలి.

**చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి..**



సంక్రాంతి పండుగ వచ్చిదంటే చిన్నప్పటి జ్ఞాపకాలు గుర్తుకొస్తాయి. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా పతంగులు ఎగురేసేవాళ్లం. రోజంతా సందడి చేసేవాళ్లం. అందుకే రెండు తెలుగు రాష్ట్రాల్లో పతంగుల పండుగ (సంక్రాంతి)కు అంత ప్రాముఖ్యత ఉంటుంది.

అరూరి సాంబయ్య, విష్ణుపురి కాలనీ కాజీపేట

**అమ్మకాలు భారీగా పెరిగాయి..**



సంక్రాంతి పండుగకు ముందే పట్టణ వ్యాప్తంగా పతంగుల విక్రయాలు ప్రారంభమయ్యాయి. అమ్మకాలు భారీగా పెరిగాయి. దాదాపు నెల రోజులపాటు విక్రయాలు కొనసాగుతాయి.

మోహన్, పతంగుల అమ్మకందారుడు, కాజీపేట

**జాగ్రత్తలు..**

- తల్లిదండ్రులు తమ పిల్లలను నిత్యం కనిపెడతూ ఉండాలి.
- భవనాలు, గోడలు, బాల్కనీలపైనుంచి గాలిపటాలు ఎగరేయొద్దు. గాలి వీచిన దిక్కు పతంగి ఎగురుతుంది. దానిపైనే శ్రద్ధ పెట్టి నడిస్తే పడిపోయే ప్రమాదం ఉంది.
- గల్లీలు, భారీ భవన సముదాయాలు, విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్ల సమీపంలో గాలి పటాలు ఎగరేసే సాహసం చేయొద్దు. పతంగి విద్యుత్ తీగలు, స్తంభాలు, వృక్షాలపై పడితే తీసుకునే ప్రయత్నం చేయొద్దు. గాలి పటాన్ని తీసుకునే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్నారు.

## శరీరదానానికి అంగీకారం..



అంగీకార పత్రాన్ని చూపుతున్న దంపతులు

హసన్‌పర్తి: మరణాంతరం తమ పార్థివదేహాలను కాకతీయ మెడికల్ కళాశాలకు ఇవ్వడానికి కాకతీయ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముంజ శ్రీనివాస్, ప్రియాంక దంపతులు ముందుకొచ్చారు. హనుమకొండ మండలం గోపాలపురం అరుణోదయకాలనీకి చెందిన డాక్టర్ ముంజ శ్రీనివాస్, ప్రియాంక దంపతులు తమ మరణాంతరం పార్థివ దేహాలను మెడికల్ కళాశాలకు ఇవ్వడానికి నిర్ణయించుకుని తెలంగాణ నేత్ర, అవయవ,శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కామిడి సతీశ్‌తో పాటు కాలనీ అధ్యక్షుడు డాక్టర్ ఆంజనేయులకు సమాచారం అందించారు. ఈమేరకు బుధవారం వారు ఆ దంపతుల ఇంటికెళ్లి మాట్లాడారు. వారి నుంచి అంగీకార పత్రం తీసుకున్నారు. ఈ పత్రాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అందిస్తామన్నారు. శరీర దానం చేయడానికి ముందుకు రావడంపై అభినందించారు. మునిగాల పద్మ పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

న్యూశాయంపేట : పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని, పేదల పక్షాన పోరాడేది సీపీఐ అని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ పార్టీ కార్యాలయంలో హనుమాన్‌నగర్‌కు చెందిన పలువురు ఎంసీపీఐ నుంచి సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా కార్యదర్శి కె. భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి కావొస్తున్నాయన్నారు. గ్రామగ్రామాన ఎర్రజెండా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు, రాష్ట్ర నాయకులు నేదునూరి జ్యోతి, నాయకులు కరుణాకర్, శ్రీనివాస్, లింగారెడ్డి, టి.భిక్షపతి, ఎల్లేశ్, లక్ష్మణ్, సారంగపాణి, నర్సయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, శంకర్, సదానందం, రమేశ్, దేవా, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

## వంశీ అంత్యక్రియలు పూర్తి

● 12 రోజుల తర్వాత స్వగ్రామం చేరుకున్న మృతదేహం
● శోకసంద్రంగా మాదన్నపేట



వంశీ (ఫైల్)

కమలాపూర్: ఉన్నత చదువు కోసం అమెరికాకు వెళ్లి అక్కడ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బండి వంశీ అంత్యక్రియలు స్వగ్రామంలో పూర్తయ్యాయి. కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు వంశీకి అంతిమ వీడ్కోలు పలికారు. వంశీ మృతదేహం 12 రోజుల తర్వాత స్వగ్రామం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని మాదన్నపేటకు చేరుకుంది. 2023 ఆగస్టు 5న ఉన్నత చదువు కోసం అమెరికాకు వెళ్లిన బండి వంశీ.. గత నెల 21న అమెరికాలో తాను నివాసముంటున్న అపార్ట్‌మెంట్ కింద ఓ కారులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వంశీ మృతదేహం బుధవారం తెల్లవారుజామున స్వగ్రామం చేరడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో మాదన్నపేట శోకసంద్రంగా మారింది. మధ్యాహ్నం నిర్వహించిన వంశీ అంత్యక్రియల్లో గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాగా ఎస్ఈడబ్ల్యూఏ–ఐఎఫ్‌డబ్ల్యూ, మిన్నెసోటా తానా ఆర్గనైజేషన్ సహకారంతో వంశీ మృతదేహం స్వగ్రామానికి చేరుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వంశీ మృతిపై అక్కడి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారని కుటుంబీకులు తెలిపారు.

## అయోమయానికి గురిచేస్తున్న అధికారులు

● తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్లి రవి



మాట్లాడుతున్న కొండమల్లి రవి

హన్మకొండ: రెవెన్యూ అధికారులు కొత్త సంఘాలు స్థాపిస్తూ ఉద్యోగులను అయోమయానికి గురి చేస్తున్నారని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్లి రవి అన్నారు. బుధవారం హనుమకొండలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ గెజిటెడ్ అధికారుల ఆగడాలు, అణచివేతలు భరించలేక రెవెన్యూ నాన్ గెజిటెడ్ ఉద్యోగులం సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇది జీర్ణించుకోలేక జేఏసీ చైర్మన్ కొత్తగా తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్‌ను స్థాపించి ఉద్యోగులను గందరగోళానికి గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. కొత్తగా స్థాపించిన సంఘంలో ప్రత్యేకంగా నాయబ్ తహసీల్దార్లను కలుపుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. నాయబ్ తహసీల్దారులు.. డ్రాయింగ్ ఆఫీసర్లుగా తమ సంఘంలో సభ్యత్వం తీసుకుంటేనే మీ బిల్లులు చేస్తామని, లేదంటే ఎందులోనైనా ఇరికిస్తామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇది ఎంత వరకు సమంజసమో, న్యాయమో జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ఆలోచించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్యా నరసింహ నాయక్, కోశాధికారి మహ్మద్ సలీం పాషా, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మరుపట్ల మల్లయ్య, గౌరవ అధ్యక్షుడు పొట్లపెల్లి రవీందర్ రావు, గొట్టిముక్కల సాంబరాజు, ఎర్ర మురళి, తదితరులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తి పాఠశాలను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా..

● ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కేసముద్రం: తాను చదువుకున్న ఇనుగుర్తి జెడ్పీహైస్కూల్‌ను రూ.7కోట్లతో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని ఎంపీ (రాజ్యసభ) వద్దిరాజు రవిచంద్ర అన్నారు. బుధవారం ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌ను సందర్శించి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇనుగుర్తి జెడ్పీహైస్కూల్‌కు నూతన భవనాన్ని నిర్మించేందుకు తాము వద్దిరాజు నారాయణ–వెంకటనర్సమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. కోటి నిధులు కేటాయిస్తామన్నారు. కలెక్టర్‌తో మాట్లాడి త్వరితగతిన పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతకు ముందు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన తండ్రి నారాయణ 18వ వర్ధంతి సందర్భంగా జేఈఈ, ఎస్ఈఈటీ మెయిన్స్‌కు ప్రిపేర్ అవుతున్న నిరుపేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో గాయత్రీ గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్, దేవేందర్, మోహన్, పెద్ద వెంకటేశ్వర్లు, చిన్న వెంకటేశ్వర్లు, కేసముద్రం పీఏసీఎస్ చైర్మన్ దికొండ వెంకన్న, బేతమళ్ల చంద్రయ్య, దార్ల రామ్మూర్తి, పింగిళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొన్న కారు..

● వ్యక్తి మృతి..ఊరుగొండలో ఘటన

దామెర: ఓ కారు.. బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలంలోని జయగిరికి చెందిన మైలగాని మల్లేశం (58) ఎస్‌వీఎస్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో ఊరుగొండ శివారులో హైదరాబాద్–భూపాలపట్నం జాతీయరహదారిపై కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొంది. దీంతో వాహనంపై ఉన్న మల్లేశం కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఎంజీఎం తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**బైక్ ఢీకొని భూపాలపల్లిలో మరొకరు..**

భూపాలపల్లి అర్బన్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సీఐ నరేశ్ కథనం ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన గాజుల వెంకటయ్య(52) గత నెల 31వ తేదీన గణేశ్‌చౌక్‌లో కిరాణాషాపునకు వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో చంటి శ్రీకాంత్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తూ వెంకటయ్యను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈప్రమాదంలో వెంకటయ్యకు తీవ్ర గాయాలుకావడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సీఐ నరేశ్ తెలిపారు.

## 'నేను మీ ఆర్‌జే భరత్ కల్యాణ్'..

లండన్‌లో రేడియో జాకీగా రాణిస్తున్న చలపర్తి ముద్దుబిడ్డ

● వినసొంపైన గొంతుకు వివిధ దేశాల శ్రోతలు ఫిదా..
● శ్రోతలకు గొప్పవారి జీవిత విశేషాల వివరణ




లండన్ స్పైస్ ఎఫ్‌ఎంలో భరత్‌కల్యాణ్

దుగ్గొండి : గుడ్ మార్నింగ్ లండన్.. మీరు వింటున్నారు 98.8 స్పైస్ ఎఫ్‌ఎం అంటూ ఓ గొంతు ఉదయమే అందరినీ పలకరిస్తుంటుంది. గొప్ప వ్యక్తుల జీవితాలను పరిచయం చేస్తూ స్ఫూర్తిని నింపుతుంటుంది. ఈ గొంతు ఇంగ్లాండ్‌లోని లండన్‌లో ఉంటున్న ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన అనేక మంది శ్రోతలకు సుపరిచితం. ఇదంతా ఎమిటీ అనుకుంటున్నారా..ఎక్కడో ఉన్న లండన్‌తో మనకే సంబంధం అనుకుంటున్నారా..ఇది మన పల్లెటూరి పేదింటి తెలుగు గొంతుక. ప్రభుత్వ ఆర్థిక సహకారంతో లండన్ వెళ్లి ఉన్నత విద్యనభ్యసిస్తూ వారాంతాల్లో స్పైస్ ఎఫ్‌ఎంలో తన గొంతు వినిపిస్తూ శోత్రలను మెప్పిస్తున్నాడు వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చలపర్తి గ్రామానికి చెందిన కోల భరత్‌కల్యాణ్. యూకే, యూఎస్, కెనడా, భారత్‌తో పాటు అనేక దేశాల్లో రేడియో శ్రోతలకు నచ్చిన రేడియో జాకీ (ఆర్‌జే)భరత్ కల్యాణ్. వారం మొత్తం జాబ్ చేసుకుంటూ వారాంతాల్లో సమయాన్ని వృథా చేయకుండా శనివారం అక్కడి స్పైస్ ఎఫ్ ఎంలో 'ది కల్యాణ్ క్రానికల్స్ విత్ భరత్' అనే కార్యక్రమం ద్వారా లక్షలాది మందికి చేరువయ్యాడు.

**ఉన్నత చదువు కోసం లండన్‌వెళ్లి..**

అందరి మాదిరి విదేశాల్లో ఎంఎస్ చేయాలని భరత్ కల్యాణ్ కోరిక. ఎలాగోలా యూకేలోని న్యూక్యాసిల్ వెళ్లి ఎంఎస్ పూర్తి చేశాడు. బిజినెస్ ఇంటెలిజెన్స్ డెవలపర్‌గా ఉద్యోగం సంపాదించాడు. అయితే చిన్నప్పటి నుంచి భరత్‌కు ప్రజలతో మమేకం కావడం ఇష్టం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా అది సాధ్యం కాలేదు. ఎలా అని ఆలోచిస్తున్న తరుణంలో ఓ ఆన్‌లైన్ ఎఫ్‌ఎం స్టేషన్‌లో రేడియో జాకీ ఉద్యోగం ఉందని ప్రకటన చూసి దరఖాస్తు చేసుకున్నాడు. ఇంటర్వ్యూలో ప్రదర్శన కనబర్చడంతో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అప్పటి నుంచి వివిధ దేశాల్లో సక్సెస్ సాధించిన వారి జీవిత విశేషాలు.. వారి విజయ ప్రయాణాన్ని శ్రోతలకు పరిచయం చేస్తూ స్ఫూర్తి నింపుతున్నాడు. ఇలా చాలా మంది తెలుగువారిని కూడా ఇంటర్వ్యూ చేశాడు.

**గొప్పవారి జీవితాలే స్ఫూర్తి..**



ఇంటర్వ్యూ ద్వారా గొప్పవారి జీవిత విశేషాలను వివరిస్తున్న భరత్ కల్యాణ్

2014 యూపీఎస్సీ టాపర్ ఇరా సింఘాల్ ఇంటర్వ్యూ అంటే నాకు ఇష్టం. గొప్ప వ్యక్తుల జీవిత విశేషాలను రేడియో జాకీగా పది మందితో పంచుకుంటున్నా. దీంతో పలువురు తనకు ఫోన్ చేసి అభినందిస్తున్నారు. గొప్పవారి జీవితాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయి. నేను పనిచేసే ఎఫ్‌ఎం దక్షిణాసియా దేశాలకు సంబంధించిన వారు నడుపుతున్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన వారితో కలిసి పనిచేస్తుంటాం.ఎలాంటి భేదాలు లేకుండా సోదరభావంతో పని చేస్తా.

– భరత్ కల్యాణ్, ఆర్‌జే

## 'కోట'లో పర్యాటకుల సందడి



శిల్ప సంపదను తిలకిస్తున్న పర్యాటకులు

ఖిలా వరంగల్: నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం కాకతీయుల రాజధాని ఖిలావరంగల్ కోటకు పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మధ్యకోట శిల్పాల ప్రాంగణంలోని శిల్ప సంపదను తిలకిస్తూ సందడి చేశారు. పలు పాఠశాలల విద్యార్థులతోపాటు దూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. కాకతీయ చరిత్ర గురించి పురావస్తుశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏకశిల చిల్డ్రన్ పార్క్‌లో చెట్లనీడన సేద దీరారు. సాయంత్రం టీజీటీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాకతీయుల చరిత్రను వివరించే సౌండ్, లైటింగ్‌షోను తిలకించారు.